# దుర్వాసన.. దోమల బాధ


ధర్మాజీగూడెంలో పూడుకుపోయిన పాతాళకుంట కాలువ


గుర్రపుడెక్క అలుముకున్న పాతాళకుంట వాగు

- పూడుకుపోయిన పాతాళకుంట కాలువ
- గుర్రపుడెక్కతో పారని మురుగునీరు
- దోమల విజృంభణ
- ధర్మాజీగూడెంలో గ్రామస్తుల గగ్గోలు

**లింగపాలెం:** ధర్మాజీగూడెంలో ఇళ్లమధ్యలో ఉన్న పాతాళకుంటలో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోయింది. దీంతో మురుగునీరు పారక.. ఒక వైపు దుర్వాసనతో.. మరోవైపు దోమలు విజృంభించి నరకం చూస్తున్నామని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామం మధ్యలో ఉన్న ఈపాతాళకుంట కాల్వ ద్వారా నీరు ఎర్రచెరువులోకి వెళ్తుంది. పంచాయతీ వారు ఈ కాల్వలో అనేక పర్యాయాలు పూడిక తీసినా పరిస్థితి షరామామూలే. గుర్రపుడెక్క పూర్తిగా అలుముకోవడంతో ఇళ్లలో వాడకం నీరు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో కాల్వ పొంగి ఆ నీరు సుమారు 200 వందల ఇళ్లను ముంచెత్తుతుంది. ఆ సమయంలో వారి కష్టాలు వర్ణనాతీతం. గతంలో ఈకాల్వను మరమ్మతులు చేపట్టేందుకు అనేకసార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి పరిశీలించారు. కాల్వ పనులకు సుమారు రూ.25 లక్షలు వరకు అవసరమవుతాయని అధికారులు అంచనాలు కూడా వేశారు. ఆ తరువాత చర్యలు మాత్రం శూన్యం. కాల్వకు ఇరువైపులా గోడలు నిర్మించి, అడుగు భాగంలో ఫ్లోరింగ్ చేయిస్తేకానీ ఈ సమస్య పరిష్కారం కాదు. ఇప్పటికైనా సంబధిత అధికారులు ఈసమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### పాతాళకుంట వాగుకు రివిట్‌మెంటు కట్టాలి



పంచాయతీ వారు తరచూ పాతాళకుంట కాల్వ పూడిక తీస్తున్నా ఫలితం ఉండడం లేదు. కాల్వలో నుంచి నీరు బయటకు వెళ్లకపోవడంతో దోమలతోపాటు తీవ్ర దర్గంధం వెదజుల్లుతోంది. వర్షాకాలంలో ఈ కాల్వ పొంగి నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. శాశ్వత పరిష్కారంగా కాల్వ అడుగు భాగంలో సిమెంట్ చేసి, గోడలకు రివిట్‌మెంట్ కట్టేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎన్.శ్రీను, ధర్మాజీగూడెం

# రాజబాబుకు కన్నీటి వీడ్కోలు


రాజబాబు భౌతికకాయాన్ని సందర్శిస్తున్న మహిళలు


జనసందోహం నడుమ రాజబాబు అంతిమయాత్ర

- పార్టీలకతీతంగా పార్థివ దేహాన్ని సందర్శించిన నేతలు, కార్యకర్తలు
- అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర, దహన సంస్కారాలు

**ద్వారకతిరుమల:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబుకు ఆదివారం కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన ఇటీవల బాత్‌రూమ్‌లో పడిపోవడంతో ఎడమ కాలికి తీవ్ర గాయం కాగా, స్థానిక విర్డ్ ఆస్పత్రిలో చేరారు. అక్కడి నుంచి హైదరబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రికి వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. దురదృష్టవశాత్తు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి అక్కడే తుదిశ్వాస విడిచారు. ఆదివారం స్వగృహంలో రాజబాబు భౌతికకాయాన్ని పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు సందర్శించారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి అంతమ యాత్ర, దహన సంస్కారాలను పూర్తి చేశారు.

**గెలుపే ఆయన బాట..**

రాజబాబు 1980లో కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేశారు. 1981లో గ్రామ సర్పంచ్‌గా, భీమడోలు పంచాయితీ సమితులు వర్క్స్ కమిటీ ఛైర్మన్‌గా సేవలందించారు. 1983లో జిల్లా గ్రంధాలయ సంస్థ సభ్యుడిగా పనిచేశారు. ఆ తరువాత టీడీపీలో చేరి, అప్పటి మాజీ మంత్రి, ఆయన బంధువు అయిన కోటగిరి విద్యాధరరావుతో కలసి పనిచేసి, అనతికాలంలోనే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1987, 1992లో జి.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. డీసీఎంఎస్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1997–2000 వరకు భీమడోలు మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా పనిచేశారు. 2000లో జరిగిన వెస్మాస్ ఎన్నికల్లో ఆయన నిలబెట్టిన అభ్యర్థి బోడపాటి సోమయ్యను ప్రతిష్టాత్మకంగా గెలిపించుకున్నారు. 2004లో భీమడోలులో జరిగిన బహిరంగ సభలో, సీఎం చంద్రబాబు యిమ్మణి రాజేశ్వరిని బలపరచి, గెలిపించమని కోరినప్పటికీ.. కుదరదని ముఖంమీదే చెప్పి, వట్టి వసంత్‌కుమార్ గెలుపునకు కృషి చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కష్టపడి పనిచేస్తూ, జగన్ మోహన్‌రెడ్డి దగ్గర మంచి గుర్తింపు పొందారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, విర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

**పార్టీలకు అతీతంగా..**

రాజబాబు మృతి అన్ని రాజకీయ పార్టీల వారిని కలచివేసింది. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి, ఆయన భార్య శిరీష, కుమారుడు సంజయ్‌లకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ ద్వారకాతిరుమల, గోపాలపురం మండలాల కన్వీనర్‌లు ప్రతాపనేని వాసు, వెలగా శ్రీరామమూర్తి, పాకలపాటి భీమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దాకారపు బంగారమ్మ, చెలికాని బుల్లియ్య, పోలకంపల్లి అనీల్‌బాబు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, ఆచంట సురేష్, కారుమంచి రమేష్, బంకా అప్పారావు, వామిశెట్టి పరమేశ్వరరావు, పానమాల ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, మల్లెపూడి నాగమణి, షేక్ భాషా, మానుకొండ సుబ్బారావు, పెద్దిన దిలీప్, దాసరి రాంబాబు, భానురెడ్డి, నల్లూరి బాపనయ్య, భోగరాజు చిన్ని, ప్రత్తిపాటి యోహాను, యాదమనేని నాగేశ్వరరావు, బిరుదుగడ్డ చల్లారావు, మద్దిపాటి సోమేశ్వరరావు, బుసనబోయిన వంశీ, తాండ్ర సురేష్‌బాబు, ఉప్పల మునేశ్వరరావు, పసుపులేటి ఏసుబాబు, దాసరి ఏసురత్నం, బిరుదుగడ్డ బజారియ్య, మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ, ఆ పార్టీ నేతలు చెలికాని సోంబాబు, పాకలపాటి గాంధి, ఏపూరి దాలయ్య, డీపీఎస్ చౌదరి, పోలిన శ్రీను, గంటా బాబ్జి, సుంకవల్లి బ్రహ్మయ్య తదితరులున్నారు.

**జగన్ పిలిచి మరీ..**


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాజబాబు (ఫైల్)

గత ఎన్నికల ముందు నారాయణపురం నుంచి భీమవరంనకు మేమంతా సిద్ధం బస్సు యాత్రగా సీఎం హోదాలో వెళుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి రాజబాబు రోడ్డు పక్కన నిలబడి అభివాదం చేశారు. ఇది చూసిన జగన్ సెక్యూరిటీ నిబంధనలను పక్కనబెట్టి మరీ.. రాజబాబును బస్సు ఎక్కించుకుని తనతో తీసుకెళ్లారు.

## వేధింపులపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** వివాహిత ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పేరంపేట రోడ్డుకు చెందిన కె.రమ్యకు, కె.శివసత్యనారాయణకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. 3 నెలల తరువాత నుంచి అధిక కట్నం కోసం శివసత్యనారాయణ, అతని కుటుంబసభ్యులు శారీరికంగా, మానసికంగా రమ్యను వేధిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన శివసత్యనారాయణ ఇనుపరాడ్డుతో ఇంట్లోకి వచ్చి రమ్యపై దాడి చేశాడు. ఈ దాడిలో రమ్య తీవ్రంగా గాయపడగా, చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## కోడి పందేలపై దాడులు

**కొయ్యలగూడెం:** మంగపతిదేవి పేట గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని మూడు పుంజులు, రూ.4,200 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

**జంగారెడ్డిగూడెం:** నిమ్మలగూడెంలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై పోలీసులు దాడి చేశారు. నిమ్మలగూడెంలోని ఓ ప్రాంతంలో కోడిపందేలపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఒక కోడిపుంజు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు లక్కవరం ఎస్సై శశాంక తెలిపారు. అలాగే మరో ప్రాంతంలో కూడా కోడి పందేలపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రూ.1700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## స్వచ్ఛందంగా చికెన్ షాపుల మూసివేత

**జంగారెడ్డిగూడెం:** బర్డ్ ఫ్లూ, బీఎస్ఎస్ వైరస్‌ల వ్యాప్తి నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పట్టణంలోని చికెన్ షాపులను వారం రోజుల పాటు స్వచ్ఛందంగా మూసివేస్తున్నట్లు చికెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు యర్రా అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 30 చికెన్‌షాపులు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు తెలియజేశారు.

## రాట్నాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పెదవేగి :** రాట్నాలమ్మ తల్లి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మకు ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, వారి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.16,935, పూజా టికెట్ల ద్వారా రూ.30,500, ఫొటోల అమ్మకంపై రూ.1500, విరాళాలు రూ.5,500 ఆందాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ చెప్పారు.

## క్లుప్తంగా

### ముగిసిన జాతర మహోత్సవాలు


నాగదుర్గాదేవికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

**బుట్టాయగూడెం:** కామవరం సమీపంలో ఉన్న దుర్గమ్మతల్లి, మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గిరిజన నృత్యాలు చేసి సందడి చేశారు. ఇక్కడికి చేరుకున్న బాలరాజుకు ఆలయ కమిటీవారు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో భక్తులు నడిచారు. అలాగే అమ్మవారికి పుట్టింటి చీర, సారె, కావిడ్లతో నాటు కోళ్లు, మేక పోతులతో మొక్కులు తీర్చుకుని అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు, ఆలయ కమిటీ సభ్యులు కొర్సా రాంబాబు, మడివి శ్రీను, పూనెం దుర్గమ్మ, గోగుల గంగమ్మ, తెల్లం శైలు, కేఆర్‌పురం ఎంపీటీసీ గాలి దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కుంజా భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అనిస్త్రీ పునిస్త్రీ ఆలయంలో పూజలు


విశేషాలంకరణలో అమ్మవార్లు

**పోలవరం రూరల్:** పట్టిసం శివ క్షేత్రంలో పునర్నిర్మించిన అనిస్త్రీ పునిస్త్రీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి నూతన విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. సంతానం లేని వారు ఇక్కడ అమ్మవారిని పూజిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. దేవస్థానం ఈవో చాగంటి సురేష్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఉపాధి పనులపై సామాజిక తనిఖీలకు సిద్ధం


సామాజిక తనిఖీలకు సంబంధించి రికార్డులు సిద్ధం చేస్తున్న సిబ్బంది

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించనున్నాయి. ఇందుకు సంబంధించిన పనుల వివరాలను గుంటూరు నుంచి వచ్చిన డీఆర్‌పీలు ఎంపీడీఓ కె.జ్యోతి నుంచి సేకరిస్తున్నారు. 2023 మార్చి 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు బుట్టాయగూడెం మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకంలో అనుబంధ శాఖల ద్వారా గ్రామాల్లో చేపట్టిన జరిగిన వివిధ పనులకు సంబంధించిన వివరాలను ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఎస్ఆర్‌పీ సూర్య చక్రం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరిగే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


చిన్నారుల కూచిపూడి నృత్యాలు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు కోదండరామ భజన మండలి ఆధ్వర్యంలో హరే శ్రీనివాస కీర్తనలు ఆలపించారు. సాయంత్రం 5.30 గంటలకు వేదాంతం విష్ణుప్రసాద్ మహాభారత వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.15 గంటల నుంచి అభినయ నృత్య భారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య డి.హేమ సుందర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ప్రదర్శనలు ఆద్యంతం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

## ద్వారకాతిరుమలలో పారిశుధ్యం అధ్వానం


పసరుకోనేరు ప్రాంతంలో పందుల స్వైరవిహారం


చైతన్యగోదావరి బ్యాంకు పక్క రోడ్డులో ఇలా..

**ద్వారకాతిరుమల:** ద్వారకాతిరుమలలో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చెత్తకుండీలు నిండి రోజులు గడుస్తున్నా పంచాయతీ సిబ్బంది వాటిని శుభ్రం చేయడం లేదు. దీనికితోడు గ్రామంలో పందుల బెడద అధికం అయ్యింది. చైతన్యగోదావరి బ్యాంకు పక్క రోడ్డులోని చెత్తకుండీ నిండి, వ్యర్థాలు కింద పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అలాగే స్థానిక పసరుకోనేరు ప్రాంతంలోను, కొత్త బస్టాండ్ పరిసరాల్లో వరాహాలు స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో ఆ ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు ప్రచారానికే పరిమితం అవుతున్నాయనడానికి ఇవే నిదర్శనమని చెప్పొచ్చు.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

**పెదపాడు:** సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని త్రీ టౌన్ సీఐ వి కోటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, సమాజంలో స్త్రీలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు అత్యవసర సమయంలో చేయవలసిన విధులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, అభయహస్తం టోల్ ఫ్రీ నంబర్లు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్ మాట్లాడిన అవగాహన వీడియోను స్క్రీన్ ద్వారా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం


చింతలపూడి: రాఘవాపురం జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన 1977 - 1982 విద్యార్థులు


కొయ్యలగూడెం: హైస్కూల్లో కలుసుకున్న 1984-85 విద్యార్థులు

**చింతలపూడి:** రాఘవాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ 1977 – 1982 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా జరిగింది. చిన్ననాటి మిత్రులంతా పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. హైస్కూల్ విడిచి 43 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కలుసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు చందూరు చిన్న కష్టారావు, చిమ్మపూడి విశ్వసుందరం, శ్రీ నలనాని చక్రవర్తుల తిరువెంగళాచార్యులు, శ్రీ బెందుకూరి ప్రవీణ్ రాయి హాజరయ్యారు. అనంతరం గురువులను సత్కరించారు. పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకోవాలని తీర్మానించారు.

**కొయ్యలగూడెంలో...**

**కొయ్యలగూడెం:** స్థానిక హైస్కూల్‌లో 1984–85 పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి మిత్రులంతా కలసుకుని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. హైస్కూల్ అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించారు.

## బేబీ కుటుంబ సభ్యులను పరామర్శించిన జేపీ

**ఏలూరు (టూటౌన్):** పోణంగి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సముద్రేని బేబీ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ), నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నేరుసు చిరంజీవి, గేదెల సూర్యప్రకాష్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మద్దాల ఫణి, బంకురు వెంకట్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## గోదావరి నీటి కోసం ధర్నా


రెడ్డిగణపవరంలో గ్రామస్తుల ధర్నా

**బుట్టాయగూడెం:** రెడ్డిగణపవరంలో సత్యసాయి సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న గోదావరి నీటిని సరఫరా చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ గత 20 రోజులుగా రెడ్డిగణపవరం గ్రామ ప్రజలకు గోదావరి నీరు సరఫరా కావడంలేదన్నారు. దీనివల్ల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులను ఎన్నిసార్లు అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదని అన్నారు. ఇప్పటికైనా రెడ్డిగణపవరంనకు గోదావరి నీటిని సరఫరా చేయాలని ఆయన కోరారు.

# మొక్కజొన్న సాగుకే మొగ్గు

- ఆరుతడి పంటలపై రైతుల ఆసక్తి
- లింగపాలెం మండలంలో 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు


లింగపాలెం మండలంలో సాగుచేసిన మొక్కజొన్న

**లింగపాలెం:** దాళ్వా పంటకు నీరు చాలకపోవటంతో రైతులు ఆరుతడిపంటలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో మెట్టప్రాంతమైన లింగపాలెం మండలంలో మొక్కజొన్న పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. మద్దతు ధరతోపాటు సాగుకు అనుకూలంగా, లాభసాటిగా ఉండడంతో మొక్కజొన్న సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. మండలంలోని కలరాయునగూడెం, అయ్యపరాజుగూడెం, ముడిచెర్ల, వేములపల్లి, ఆశన్నగూడెం, నరసన్నపాలెం, కొత్తపల్లి, కె.గోకవరం, తోచలక, యడవల్లి, లింగపాలెం, మఠంగూడెం, కొణిజర్ల తదితర గ్రామాల్లో ప్రస్తుతం సుమారు 3,127 ఎకరాల్లో మొక్కజొన్న పైరును రైతులు సాగుచేశారు. ఈమేరకు మండలంలో నూజివీడు సీడ్స్, బయోసీడ్స్ అనే రకాల మొక్కజొన్న విత్తనాలను రైతులు ఎక్కువగా వేయటం జరిగింది. ఈపంటలో 85 శాతం సీడ్ మొక్కజొన్న 10 శాతం కమర్షియల్ మొక్కజొన్న వేశారు. మరో ఐదు శాతం ఈ ఏడాది రైతులు పాప్ కార్న్, స్వీట్‌కార్న్ మొక్కజొన్న పంటను కూడా రైతులు సాగు చేస్తున్నారు. గతేడాదితో పోల్చుకుంటే కమర్షియల్ మొక్కజొన్న కన్నా సీడ్ మొక్కజొన్న పంటను ఎక్కువగా రైతులు సాగుచేశారు. కమర్షియల్ మొక్కజొన్న ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి అవుతుందని, 38 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావచ్చునన్నారు. క్వింటా ధర రూ రూ.2,300 ఉన్నట్లు రైతులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, విద్యుత్ సప్లయ్ సక్రమంగా ఉంటే పెట్టిన పెట్టుబడులు వస్తే అప్పుల ఊబినుంచి బయటపడతామని రైతులు అంటున్నారు.